యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

- ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు
- వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్లతో ఆహారం అందించండి
- జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో సిఎం ఏరియల్ సర్వే



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చూడాలనీ, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలనీ, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు మొదలయ్యాయనీ, అనుకోని ఉపద్రవం వస్తే రైతులకు ఆవేదన మిగులుతుందని సిఎం అన్నారు. రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందనీ, అందుకు తగ్గట్టుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలన్నారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవెన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వే చేసి నష్టపు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. వరద ప్రభావిత జిల్లాల్లో చేపడుతున్న సహాయక చర్యలు, రోడ్లు, రహదారుల పునరుద్ధరణ, ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సమీక్షించాలని సిఎం కోరారు. తమ సొంత జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, ఇన్‌చార్జిగా ఉన్న జిల్లాల్లో సహాయ చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

ధాన్యాన్ని గోదాములకు తరలించండి

ఐకెపి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను సిఎం ఆదేశించారు. అవి అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని సూచించారు. ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికో ఇన్‌చార్జి అధికారిని నియమించాలని సూచించారు. ఐకేపీ సెంటర్ల నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలనీ, నిర్లక్ష్యం వహించే అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. 'వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. విధానపరమైన నిర్ణయాలను అవసరమైతే సివిల్ సప్లయిస్ కమిషనర్, సిఎస్ దృష్టికి తీసుకురావాలి. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి' అని సిఎం అన్నారు.

పోలీసుల సేవలు వినియోగించుకోండి

వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాల, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందితో పాటు సామగ్రిని పంపించాలని సిఎస్, డిజిపిలను ఆదేశించారు. తక్షణ సహాయక చర్యల నిమిత్తం అవసరమైనన్ని పడవలను పంపించాలనీ, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని సైతం తక్షణమే తరలించాలని ఆదేశించారు. ఇప్పటికే తొమ్మిది రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేసి రెండు వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు సిఎంకు వివరించారు. వరదల్లో ఎక్కడైనా ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలను గుర్తించి డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఆహార పొట్లాలు సరఫరా చేయాలని సిఎం సూచించారు

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు

వర్షాలు, ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడితే, వెంటనే పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖమ్మం జిల్లాలో డిసిఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జీలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సిఎం అభిప్రాయపడ్డారు. రోడ్లు, రహదారులపైకి వరద వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా ఇరువైపులా బారికేడ్లు పెట్టాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని, కుంభవృష్టి కురిసే సమయంలో అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరంగల్ జిల్లాలో 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు. విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, హైదరాబాద్ జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో పాటు తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు సిఎం ఏరియల్ సర్వే

వరంగల్, హుస్నాబాద్ వరద ప్రాంతాల్లో శుక్రవారం సిఎం ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు, పంట నష్టం వాటిల్లిన ప్రాంతాలను పరిశీలిస్తారు. గురువారం ఉదయమే వరద ప్రభావిత జిల్లాలకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి సిద్ధపడ్డారు. వాతావరణం అనుకూలించకపోవటంతో హెలికాప్టర్ ప్రయాణం వీలు కాదని ఏరియల్ సర్వేకు అధికారులు అనుమతించక పోవడంతో ఆఖరి నిమిషంలో పర్యటన రద్దయింది.

విద్యార్థుల భవిష్యత్ మాకు ముఖ్యం

- ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల విడుదలపై మంత్రి అడ్లూరి హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు పనిచేస్తున్నదనీ, గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ బకాయిల నిధులు విడుదల చేశామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాల విద్యార్థులందరికీ విద్య ద్వారా సమాన అవకాశాలు దక్కాలనీ, వారి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఒక్కో విద్యార్థికి ఓవర్సీస్ పథకం కింద రూ .20 లక్షలు ఇచ్చామని, 2, 288 విద్యార్థులకు సుమారు రూ. 304కోట్ల నిధులు విడుదల చేశామని గుర్తు చేశారు. ఇప్పటివరకు 3,642 మంది విద్యార్థులకు రూ.463 కోట్లు విడుదల చేశామని తెలిపారు. 2022 నుంచి ఇప్పటి వరకు ఉన్న బకాయిలన్నీ విడుదల అయ్యాయని చెప్పారు. అర్హతకలిగిన విద్యార్థులకు నేరుగా వారు బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుందన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను కొనసాగిస్తున్న విద్యార్థులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించి ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులను విడుదల చేశామన్నారు.



జంట జలాశయాల గేట్లు ఎత్తివేత


- మంచిరేవుల, కిస్మత్‌పూర్ వద్ద రాకపోకలు బంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు హైదరాబాద్ జంట జలాశయాలకు వరద పోటెత్తుతుండటంతో అధికారులు గురువారం గేట్లు ఎత్తారు. గండిపేట్ (ఉస్మాన్‌సాగర్) ఆరు గేట్లు, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. వరద ఉధృతికి హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మూసీ బ్రిడ్జి డ్యామ్, మంచిరేవుల ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద బ్రిడ్జి తెగిపోయింది. ఫుట్‌పాత్ దారులు పూర్తిగా కొట్టుకుపోయాయి. మంచిరేవుల బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. రాకపోకలు పూర్తిగా నిలిచాయి. కిస్మత్‌పూర్ బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతంగా రావడంతో రాకపోకలు నిలిపివేశారు.

ఫొటో ఐడి కార్డు ఏది ఉన్నా.. ఓటు వేయొచ్చు

- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓటరు జాబితాలో పేరు ఉండి.. ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా పర్వాలేదు.. ఓటర్లు ఎపిక్ కార్డు కాకుండా 12 ప్రత్యామ్నాయ ఫొటో 'ఐడీ'లలో దేనినైనా ప్రదర్శించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో ముందుగా పేరును పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా 12 ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు.

ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులు ఇవే..

ఆధార్, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాల కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పిఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా (ఆర్‌జిఐ) జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పిఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లో ఏదైనా ఒకటి కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

పెండింగ్ ఫీజులు విడుదల చేయాల్సిందే

- లేకుంటే ఎమ్మెల్యేలు, మంత్రులను అడ్డుకుంటాం
- ఫీజులు అడిగితే విద్యాసంస్థలలో విజిలెన్స్ దాడులతో బెదిరిస్తారా?
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాలలు, యూనివర్శిటీలు బంద్
- హైదరాబాద్‌లో నారాయణగూడ నుంచి వైఎంసిఎ వరకు భారీ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం విస్మరించడంతో 23 నెలలుగా విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలు పెండింగ్ ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్ కోసం రోడ్డెక్కారు . అయినా ప్రభుత్వం సమస్య పరిష్కారం చేయకుండా ఇంకా జఠిలం చేస్తుందండటంతో వాటిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. బంద్ అనంతరం హైదరాబాద్ లో నారాయణగూడ నుంచి వైఎంసిఎ సర్కిల్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజులు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఫీజులు కోసం విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. గత ప్రభుత్వం బకాయిలు కూడా చెల్లిస్తామని చెప్పి అవి చెల్లించక పోగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవ్వాల్సిన రూ.4,600 కోట్లు బకాయిలు కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ చేసిన సందర్భంగా ప్రభుత్వం చర్చలు జరిపి రూ.1,200 కోట్లను దసరాకు రూ.300 కోట్లు, దీపావళికి రూ.900 కోట్లు, నవంబర్‌లో మరో రూ.300 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు.

రాష్ట్రంలో ఫీజులను చెల్లించాలని అడిగిన ప్రతిసారి విజిలెన్స్ దాడులు పేరుతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజిలెన్స్ దాడులు పేరుతో విద్యాసంస్థలే ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం వద్దనేలాగా చేసి, ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజులను చెల్లించి సమస్యను పరిష్కరించాలనీ, లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిన బంద్ జయప్రదం అయిందని వారు ప్రకటించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిరణ్, కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనకు కట్టుబడి ఉన్నామంటున్న రేవంత్ రెడ్డి నిర్బంధం ప్రయోగించి బంద్ అణచివేయాలని ప్రయత్నించడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. తక్షణమే హైదరాబాద్, కరీంనగర్ జిల్లాలో అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యారంగంలో అడుగడుగునా సమస్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ ఫీజులు, బెస్ట్ బకాయిలు విడుదల చేయకపోవడం తదితర అనేక సమస్యలున్నా రాష్ట్ర సర్కారు నిద్రావస్థలో ఉందని ఎద్దేవా చేశారు. ఫీజులను విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

హైదరాబాద్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరాను బస్సులు అడ్డుకుంటుండుగా, ఉస్మానియాలో బంద్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. కరీంనగర్, మహబూబ్‌నగర్ పోలీసులు నిర్బంధం ప్రయోగించారనీ, ఈ అక్రమ నిర్బంధాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ భారీ ప్రదర్శనలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్, హైదరాబాద్ జిల్లా నాయకులు స్టాలిన్, నాగేందర్, మనోజ్, ఆంజనేయులు, శివ గణేష్ ,కార్తీక్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శరీరం కాలిన వారికి ఉచిత ప్లాస్టిక్ సర్జరీలు

- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు శరీరం కాలి గాయాలైన వారికి ఉచిత ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించనున్నట్టు "బర్న్ సర్వైవర్ మిషన్ సేవియర్ ట్రస్ట్" (బీఎస్ఎంఎస్) తెలిపింది. పెగాసిస్టమ్ ఆధ్వర్యంలో ఈ ఉచిత ప్లాస్టిక్ సర్జరీలు జరుగుతాయని బీఎస్ఎంఎస్ సలహాదారు నాగరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉచిత సర్జరీ కోసం శుక్రవారం (అక్టోబర్ 31) నుంచి నవంబర్ 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాల వల్ల కొందరికి శరీరంలోని కొన్ని భాగాలు కాలిపోతుంటాయని చెప్పారు. అలాంటివారు తమ రూపాన్ని చూసుకొని ఆత్మన్యూనత భావానికి గురవుతుంటారని అన్నారు. వారికి అవసరమయ్యే ప్లాస్టిక్ సర్జరీలు చాలా ఖరీదు అనీ, అందుకే చాలామంది ఈ సర్జరీలకు దూరంగా ఉండిపోతుంటారని పేర్కొన్నారు. అలాంటి బాధితులకు ఉచితంగా సర్జరీలు చేయించేందుకు ముందుకు వచ్చిన పెగాసిస్టమ్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కాలిన గాయాల బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 7816079234 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

ఢిల్లీలో భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్

- ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ స్టాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలో భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపం హాల్ నెంబర్14లో నిర్వహించిన భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్‌లో ఈ స్టాల్ ఏర్పాటు చేశారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి తెలంగాణ బియ్యం ఎగుమతి సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్టు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వివరించారు. ఈ సమావేశానికి వచ్చిన వివిధ దేశాల ప్రతినిధుల దృష్టిని తెలంగాణ స్టాల్ ఆకర్షించింది. కువైట్, ఆఫ్రికా దేశాల ప్రతినిధి.. ఎన్‌సిఇఎల్ ఎండి ఉనుపోమ్ కౌసిక్, ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ప్రేమ్ గార్గ్, దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖ బియ్యం ఎగుమతిదారులు తెలంగాణ స్టాల్‌ను సందర్శించారు. ఎంటియు 1010, ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 118 – జై శ్రీరామ్, హెచ్ఎంటి సోనా, చిట్టిముత్యాలు వంటి ప్రీమియం రకాల బియ్యాన్ని తెలంగాణ స్టాల్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ.. 'తెలంగాణలో పండించే బియ్యాన్ని ఇప్పటికే ఫిలిప్పిన్స్‌కు ఎగుమతి చేస్తున్నాం. అలాగే మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. బియ్యం ఎగుమతి పెరిగితే.. తెలంగాణ రైతులకు చాలా మేలు జరుగుతుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్-అఫీషియో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం స్టీఫెన్ రవీంద్ర, కోఆర్డినేషన్ సెక్రెటరీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌డిఆర్‌ఎఫ్, పిఆర్ నిధులు వాడుకోండి

- అప్రమత్తతతో ప్రమాదాన్ని నివారించాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తుఫాను నేపథ్యంలో సహాయ, పునరావాస చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్లు ఎస్‌డిఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్), పిఆర్ 27 నిధులు వాడుకుని, తదుపరి 30 రోజుల్లో ఆమోదింపజేసుకోవాలని, నిధులకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేదని కలెక్టర్లను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ 48 గంటల ముందే అందరినీ అప్రమత్తం చేసిందని, ప్రభుత్వ యంత్రాంగం అందుకనుగుణంగా స్పందించడంతో ప్రాణ, భారీ ఆస్తి నష్టం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోగలిగామని ఆయన తెలిపారు. రాబోయే 24 గంటలు కలెక్టర్లు, ఇతర అధికారులు సైక్లోన్, మాన్యువల్ దగ్గర పెట్టుకొని సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని కోరారు. తుపాను ప్రభావం కృష్ణా జిల్లా నుంచి నల్లగొండ, ఖమ్మం జిల్లా మీదుగా వెళ్లడంతో ఉత్తర తెలంగాణలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని డిప్యూటీ సిఎం వివరించారు. అధికారులు అప్రమత్తమై పత్తి తడవకుండా టార్పాలిన్లు కప్పడం, గోదాముల్లోకి పత్తి పంటను షిఫ్ట్ చేయడంతో పత్తి పంటను కాపాడుకోగలిగినట్టు వెల్లడించారు.

తుఫాను నేపథ్యంలో విద్యుత్ శాఖ తుఫాను సహాయ చర్యల్లో నిమగ్నమయిందని డిప్యూటీ సిఎం తెలిపారు. భారీ తుఫాను వచ్చినప్పటికీ ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తకుండా మొబైల్ వ్యాన్లు పెట్టుకొని సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటూ ముందుకు వెళ్లారని ఆయన వివరించారు. తుఫాను నేపథ్యంలో రెండు డిస్కంల పరిధిలో 11. 33/11 కెవి సబ్ స్టేషన్లు దెబ్బతినగా ఏడు సబ్ స్టేషన్లను తిరిగి పునరుద్ధరించారని తెలిపారు. కొద్దిగంటల్లో మిగిలిన నాలుగు సబ్ స్టేషన్లను పునరుద్ధరిస్తారని వివరించారు. 101. 33 కెవి లైన్లు దెబ్బతినగా అందులో 96 లైన్లను ఇప్పటికే పునరుద్ధరించినట్టు చెప్పారు. గురువారం మిగిలిన 5 లైన్లను పునరుద్ధరిస్తారని వివరించారు. 11 కెవి లైన్లు 237 దెబ్బతినగా ఇప్పటికే 227 లైన్లను పునరుద్ధరించారని వివరించారు. డిటిఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్)లు 171 దెబ్బతినగా 49 ప్రాంతాల్లో పునరుద్ధరించారని, మరో 122 ట్రాన్స్ ఫార్మర్లు కొద్ది గంటల్లో పునరుద్ధరిస్తారని డిప్యూటీ సిఎం చెప్పారు. 638 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా 304 విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారనీ, మరో 334 విద్యుత్ స్తంభాలు కొద్ది గంటల్లో పునరుద్ధరిస్తారని డిప్యూటీ సిఎం తెలిపారు.

ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి

- 20 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనాలి..
- బిసి రిజర్వేషన్‌పై బిజెపి ద్వంద్వ వైఖరి
- అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ లొంగుబాటు
- నిరుద్యోగ జెఎసికి సిపిఎం మద్దతు : జాన్‌వెస్లీ
- ఖమ్మంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన


తుపాను ప్రాంతాలలో పర్యటిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల ధాన్యంలో తేమ శాతం పెరిగిన దృష్ట్యా 20 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేయాలని కోరారు. వెంటనే నష్టాలను అంచనా వేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పంట నష్టాలను సేకరిస్తున్నామని తెలిపారు. నష్టాలను అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వెంటనే రైతులను ఆదుకోకపోతే రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాల పాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయన్నారు. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.60 వేలకు పైగా రైతులు నష్టపోయారని తెలిపారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షాలతో కొట్టుకుపోయిందన్నారు. పంట చేలల్లోకి నీరు చేరిందన్నారు. పంటలు దెబ్బతినటంతోపాటు చేలల్లో మేటలు వేసిన ఒండ్రు, ఇతరత్రా చెత్తాచెదారం తొలగించడానికి మరికొంత వెచ్చించాల్సి ఉంటుందన్నారు. అనేక చోట్ల ఆస్తి, ప్రాణనష్టం సంభవించాయని తెలిపారు. పత్తి తీత దశలో వర్షాలు రావటంతో నల్లగా మారిందన్నారు. తద్వారా రైతులు పెట్టుబడి, శ్రమ కోల్పోయారని తెలిపారు. అనేక చోట్ల మొక్కజొన్న రైతుల పరిస్థితి సైతం ఇలాగే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వారం రోజుల్లో కోతకు వచ్చే వరి కూడా నేలవాలిందన్నారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమల్లో బిజెపి నాటకం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి వైఖరి కారణంగానే ఇది అమలు కావటం లేదన్నారు. బిసిల రిజర్వేషన్ విషయంలో పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలన్నా.. రాజ్యాంగ సవరణ జరగాలన్నా కేంద్ర ప్రభుత్వం పరిధిలోవే అని తెలిపారు. ఈ విషయంలో బిజెపి నాటకాలాడుతోందని, ద్వంద్వ వైఖరి అనురిస్తోందని విమర్శించారు. 9వ షెడ్యూల్‌లో దీనిని చేర్చి బిసి రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం పోరాడాలనుకునే శక్తులు కేంద్ర ప్రభుత్వంపైనా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ ఆర్డినెన్స్, సర్వేలు చేశామంటే కుదరదని, అఖిలపక్షంతో కలిసి కేంద్రంపై పోరాడాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్.. పోస్టుల భర్తీపై పోరాటం

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించటంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు సరిగాలేదని జాన్‌వెస్లీ అన్నారు. బకాయి రూ.8వేల కోట్లుంటే రూ.1200 కోట్లు చెల్లిస్తామని ఒప్పందం చేసుకొని చెల్లించపోవటంతో ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వటం లేదన్నారు. దీనివల్ల విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. నిరుద్యోగ జెఎసి ఆందోళనలకు సిపిఎం మద్దతు ఇస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్‌లలోని పోస్టులనే భర్తీ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు.

రాష్ట్రంలోని సమస్యల పరిష్కారంలో బిజెపి నిర్లక్ష్యం

రాష్ట్ర సమస్యల పరిష్కారంలో కేంద్రంలోని బిజెపి నిర్లక్ష్యపూరిత వైఖరి అనుసరిస్తోందని జాన్‌వెస్లీ ఆరోపించారు. బనకచర్ల విషయంలో ఆంధ్రా-తెలంగాణ వాటా తేల్చాలన్నారు. ఈ విషయంలో ఏకపక్షంగా బిజెపి వ్యవహరించి తెలంగాణకు అన్యాయం చేయటానికి ప్రయత్నించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల్లోనూ కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలకు నిధులు ఇవ్వటం లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు ఇవ్వటంలోనూ నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. రాజ్యాంగాన్ని, హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవటంలో మోడీ విఫలమవుతున్నారని విమర్శించారు. సామ్రాజ్యవాద విధానాలు, ట్రంప్ టారిఫ్‌లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలన్నింటితో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సందర్శన

మొంథా తుఫాను ప్రభావిత మండలాలు కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పర్యటించినట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. నాణ్యతతో సంబంధం లేకుండా పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని కోరారు. ఎకరానికి 60 బస్తాల దిగుబడి రావాల్సిన వరి 30 బస్తాలు మాత్రమే వస్తోందన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఎండి అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాంనాయక్, వై విక్రమ్, బుర్రి ప్రసాద్, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేశ్, కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, నవీన్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి పిట్టల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ అవుట్ కాదు...బ్లాక్‌మెయిల్

- డిస్కంలకు రూ.లక్ష కోట్ల ప్యాకేజీ కేంద్రం కుట్ర
- రాష్ట్రాల హక్కుల్ని హరించే ప్రయివేటీకరణ చర్య
- ప్రజలు తిప్పికొట్టాలి : ఇఇఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలు తమ విద్యుత్ హక్కును పరిరక్షించుకుంటూ, ఆ రంగంలో కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ చర్యల్ని తిప్పికొట్టాలని ఇండియన్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఇఇఎఫ్ఐ) కోరింది. ఈ మేరకు తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీయూఇఇయూ) ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి గురువారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 1 లక్ష కోట్ల బెయిలౌట్ ప్యాకేజ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కొన్ని ఆంగ్ల దినపత్రికల్లో దీనికి సంబంధించిన కథనాలు ప్రచురితమయ్యాయనీ, ఈ ప్రతిపాదన అత్యంత దుర్మార్గమైందని విమర్శించారు. ప్యాకేజీలో భాగంగా డిస్కంలను ప్రయివేటీకరించాలనీ, లేకుంటే ఆయా రాష్ట్రాలకు చెందిన డిస్కంలను స్టాక్ ఎక్స్ఛేంజీలోకల లిస్ట్ చేయించాలని కేంద్రం బలవంతం చేయడం సరికాదన్నారు. ఇది విద్యుత్ సంస్థల్ని అదానీ, రిలయన్స్, టాటా వంటి పెద్ద కార్పొరేట్లకు అప్పగించి, లాభం చేకూర్చే ప్రభుత్వ బ్లాక్‌మెయిల్ చర్య అని విమర్శించారు. 1990 నాటి సరళీకృత ఆర్థిక విధానాల కొనసాగింపేననీ, దీన్ని విద్యుత్ ఉద్యోగులతో పాటు ప్రజలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 2025 విద్యుత్ (సవరణ) బిల్లు కూడా ఇవే అంశాలను ప్రస్తావిస్తున్నాయని తెలిపారు. విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలను రకరకాల ఆర్థిక ప్రలోభాలకు గురిచేస్తున్నారనీ, అమలు చేయని రాష్ట్రాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. విద్యుత్ సవరణ బిల్లు 2018, 2020, 2022లో పునరుద్ధరించినా నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజినీర్స్ (ఎన్‌సీసీఓఈఈఈ) నేతృత్వంలో బలమైన పోరాటాల వల్లే నిలుపుదల సాధ్యమైందన్నారు. డిస్కంలకు నష్టాలు ప్రభుత్వ సరళీకృత ఆర్థిక విధానాలు, ఎక్కువ ధరకు ప్రయివేటు సంస్థలు విద్యుత్‌ను విక్రయించడం వంటివే కారణమని స్పష్టంచేశారు. విద్యుత్ సంస్థల్లో ప్రయివేటీకరణ పదేపదే విఫలమైనా, కేంద్ర ప్రభుత్వం గుణపాఠాలు నేర్వట్లేదని పేర్కొన్నారు.

థింక్ గ్యాస్‌తో టాటా మోటార్స్ జట్టు

న్యూఢిల్లీ : సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ థింక్ గ్యాస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది. ఇందులో భాగంగా భారీ ట్రక్కుల కోసం ఎల్ఎన్‌జి రిఫ్యూయెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి వీలుగా ఇరు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ ఒప్పందంపై టాటా మోటార్స్ ట్రక్స్ బిజినెస్ మెడ్ రాజేష్ కౌల్, థింక్ గ్యాస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సొమిల్ గార్గ్ సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం మౌలిక సదుపాయాల సన్నద్ధతను మెరుగుపరచడం, ఇంధన నాణ్యతపై ఎక్కువ అవగాహన కల్పించడం, ఎల్ఎన్‌జి ఆధారిత వాణిజ్య వాహనాల విస్తృత అమలును సాధ్యం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.


ఉపఎన్నికల ప్రచారంలో దోసెలు వేస్తున్న మంత్రులు

జూబ్లీహిల్స్‌లో దోసెలు వేసిన మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచార బాట పట్టింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లోని శ్రీకృష్ణానగర్‌లో ప్రచారంలో భాగంగా మంత్రులు ఓ హోటల్‌లో దోసెలు వేశారు.


చెరువులో పసుపు, కుంకుమ జల్లుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి

పార్టీ మారుతున్నానంటూ దుష్ప్రచారం చేస్తున్నారు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి గురించి తప్ప తనకు పార్టీ మారే ఆలోచన లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం చెరువుతోపాటు చౌటుప్పల్, తంగడపల్లి చెరువును ఆయన సందర్శించారు. అలుగుపోస్తున్న చెరువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానని, పార్టీకి రాజీనామా చేస్తున్నానని కావాలనే బిఆర్ఎస్ పార్టీ వారు, కాంగ్రెస్ పార్టీలో కొందరు తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా తాను ఏదైనా నిర్ణయం తీసుకుంటే స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి ప్రకటిస్తానన్నారు. తాను సిన్సియారిటీ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తనని, ఎమ్మెల్యేనని అన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేస్తానని తెలిపారు. క్రమశిక్షణ గల కాంగ్రెస్‌పార్టీ నాయకునిగా, కార్యకర్తగా రాహుల్‌గాంధీ నాయకత్వంలో పార్టీ కోసం పనిచేస్తానన్నారు. తనపై సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, నాయకులు పబ్బు రాజుగౌడ్, సుర్వి నర్సింహాగౌడ్, బత్తుల విప్లవ్‌కుమార్‌గౌడ్, పాశం సంజయ్‌బాబు, ఎమ్‌డి.బాబాషరీఫ్, మొగుదాల రమేశ్, సందగల్ల సతీశ్ పాల్గొన్నారు.

ఎఐ ఆవిష్కరణలకు సామ్‌సంగ్ రూ. కోటి బహుమతి

న్యూఢిల్లీ : దిగ్గజ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ సొల్యూషన్ ఫర్ టుమారో 2025 నాల్గవ ఎడిషన్ విజేతలను ప్రకటించింది. మొదటి నాలుగు విజేత జట్లు ఇంక్యుబేషన్ సపోర్ట్ కోసం రూ.1 కోటి గ్రాంట్‌ను సాధించాయని తెలిపింది. టాప్ 20 జట్లు కూడా రూ.లక్ష చొప్పున గెలుచుకున్నాయని పేర్కొంది. అదే విధంగా వారందరికీ గెలాక్సీ జడ్ ఫ్లిప్ స్మార్ట్‌ఫోన్లను అందించినట్లు తెలిపింది.

హెచ్‌సిఎహెచ్‌లో ఆధునిక రోబోటిక్ సేవలు

ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో హెచ్‌సిఎహెచ్ సువిటాస్ రిహాబిలిటేషన్ కేంద్రంలో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ అండ్ రికవరీ సేవలను ప్రారంభించింది. ఇది స్ట్రోక్, న్యూరో రిహాబిలిటేషన్‌లో ఒక ప్రధాన ముందడుగును సూచిస్తుందని హెచ్‌సిఎహెచ్ ఇండియా సహ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు డాక్టర్ గౌరవ్ తుక్రాల్ తెలిపారు. "స్ట్రోక్ లేదా మేజర్ సర్జరీ తర్వాత మొదటి 90 రోజులు రోగి కోలుకునే ప్రయాణంలో అత్యంత నిర్ణయాత్మక దశగా నిలుస్తుంది. ఎఐ రోబోటిక్స్ అండ్ రికవరీ ల్యాబ్ వద్ద, మా లక్ష్యం సాధ్యమైనంత వేగంగా కోలుకునేలా చేయటం మీద మాత్రమే ఉంటుంది." అని తెలిపారు. "కోలుకోవడం కూడా శాస్త్రీయంగా ఉండాలనే మా నమ్మకాన్ని రోబోటిక్స్ అండ్ రికవరీ ల్యాబ్ ప్రతిబింబిస్తుంది." అని హెచ్‌సిఎహెచ్ మరో సహ వ్యవస్థాపకుడు అంకిత్ గోయెల్ పేర్కొన్నారు.

బృహస్పతి టెక్నాలజీస్‌కు కోల్‌కతా మెట్రో సిసిటివి కాంట్రాక్టు

హైదరాబాద్ : ప్రముఖ సిసిటివి సర్వైలెన్స్ సిస్టమ్ ఇంటిగ్రేటర్ కంపెనీలలో ఒకటైన బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్‌కు కోల్‌కతా మెట్రో రైల్వే ఉత్తర, దక్షిణ (బ్లూ లైన్) మార్గంలో ఐపి ఆధారిత సిసిటివి సర్వైలెన్స్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్ట్ దక్కినట్లు ఆ సంస్థ తెలిపింది. దీని కాంట్రాక్టు విలువ రూ.25.34 కోట్లుగా ఉందని పేర్కొంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా పాత అనలాగ్ సిస్టమ్‌లను ఆధునిక ఐపి ఆధారిత సర్వైలెన్స్ టెక్నాలజీతో మార్చి భద్రతను మరింత బలపర్చనున్నట్లు బృహస్పతి టెక్నాలజీస్ ఎండి, సిఇఒ రాజశేఖర్ పాపోలు తెలిపారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్ట్‌లో కోల్‌కతా మెట్రోతో భాగస్వామ్యం కావడం తమ అదృష్టమన్నారు.

జియో-బిపి అతిపెద్ద ఇవి మొబిలిటీ కేంద్రం ఏర్పాటు

బెంగళూరు : బెంగళూరులోని దేవనహళ్లిలో జియో-బిపి సంస్థలు అతి పెద్ద సమీకృత మొబిలిటీ కేంద్రాన్ని ప్రారంభించినటు ఆ సంస్థ తెలిపింది. ఇందులో 28 ఇవి ఛార్జింగ్ పాయింట్లు ఉన్నాయని పేర్కొంది. ఇక్కడ 360కిలోవాట్ వరకు సూపర్‌ఫాస్ట్ ఇవి చార్జర్లు ఉన్నాయని తెలిపింది. ఇది పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి, రిటైల్, వైల్డ్‌బీన్ కేఫ్‌తో కలిపి భారతదేశంలో అతి పెద్ద ఇంధన రిటైల్ సైట్‌గా మారిందని జియో-బిపి చైర్మన్ సార్థక్ బెహురియా తెలిపారు.


నాశనం చేసేందుకు మాదకద్రవ్యాలను పరిశీలిస్తున్న అధికారులు

కోట్లాది రూపాయల డ్రగ్స్ కాల్చివేత

- 2019 నుంచి 2025 మధ్యకాలంలో రూ.4,56,43,930 డ్రగ్స్ స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను పోలీస్ అధికారులు గురువారం కాల్చేశారు. నగర సీపీ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో మాదకద్రవ్యాల నిర్మూలన కమిటీ చైర్‌పర్సన్, డిసిపి (డిడి) ఎన్ శ్వేత నేతృత్వంలో నిషేధిత మాదకద్రవ్యాలను నాశనం చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నుంచి 2025 మధ్య కాలంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 26 పోలీస్ స్టేషన్ పరిధుల్లో ఎన్‌డిపిఎస్ యాక్టు ప్రకారం 128 కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో 6.477 గ్రాముల కొకైన్, 1585.907 కిలోల గంజాయి. 4.6 గ్రాముల ఎక్ససీ పిల్స్, హాష్ ఆయిల్ 4450ఎం.ఎల్, ఎల్ఎస్‌డి నాలుగు బాటిళ్ల, 159.4గ్రాముల ఎండిఎంఎ, 3 నైట్రెట్ మాత్రలు, ఒబిసి రెండు పేపర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4,56,43,930 ఉంటుంది. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను రంగారెడ్డి జిల్లాలోని ఏదులపల్లెలోని జిఎ మల్టీక్లేవ్ (ఇండియా) ప్రయివేటు లిమిటెడ్ (బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ హ్యాండ్లింగ్ సర్వీసెస్)లో కాల్చివేశారు. గత ఏడాది కూడా 326 కేసులను సంబంధించిన రూ.10,56,64,125 మాదక ద్రవ్యాలను పోలీసులు కాల్చివేసిన విషయం తెలిసిందే.

రాజకీయ లబ్ధి కోసమే అజారుద్దీన్‌కు మంత్రిపదవి

- సినీ కార్మికులను ప్రభావితం చేసే ప్రకటనలు అక్షేపణీయం
- ఇసికి బిజెపి ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో ఒక వర్గం నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకే రాష్ట్ర సర్కారు అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టిందనీ, సినీ కార్మికులను ప్రభావితం చేసేలా సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలు చేశారని బిజెపి నేతల మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. మంత్రి పదవి ఇవ్వడాన్ని అడ్డుకోవాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో బిజెపి బృందం ఇసికి ఫిర్యాదు చేసింది. అనంతరం శశిధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ మంత్రివర్గ విస్తరణ చేయవద్దని ఎక్కడ కూడా లేదనీ, అయితే, గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి జూబ్లీహిల్స్ నుంచి పోటీచేసిన అజహరుద్దీన్‌ను మంత్రి వర్గంలోకి తీసుకోవడాన్నే ఆక్షేపిస్తున్నామని తెలిపారు. మంత్రి పదవి ఆశ చూపి ఆ వర్గాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోందని విమర్శించారు. ఎన్నికల ఉల్లంఘన జరిగితే అధికారుల నిర్లక్ష్యనికి సంబంధించి చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరామన్నారు. బిజెఎల్‌పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు రోజురోజుకీ దిగజారి వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మంత్రి వర్గ విస్తరణను ఎన్నికల సంఘం అడ్డుకోవాలని ఇసిని కోరామన్నారు. ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని నొక్కి చెప్పారు.

రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ నేడు ప్రమాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రముఖ క్రికెటర్ మహమ్మద్ అజహరుద్దీన్ శుక్రవారం ఉదయం 12.15 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. రాజ్‌భవన్ కార్యాలయ అధికారులు ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఇతరుల ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఇదిలా వుండగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో నూతన మంత్రివర్గ విస్తరణను తక్షణమే నిలిపివేయాలంటూ బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ లేఖను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించినట్టు తెలిసింది. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే అజహరుద్దీన్ ప్రమాణం స్వీకారం కార్యక్రమం ఉండే అవకాశం ఉందని రాజ్‌భవన్ వర్గాలు చెబుతున్నాయి.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

- మతోన్మాద బిజెపి.. పదేళ్ల అభివృద్ధిని పట్టించుకోని బిఆర్ఎస్‌ను ఓడించండి..
- ఓటర్లకు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

వచ్చేనెల 11న జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు సిపిఎం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్డులోని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్ మాట్లాడుతూ.. మతోన్మాద ప్రజావ్యతిరేక బిజెపిని ఓడించడానికి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపిగా గెలిచిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి, హైదరాబాద్‌కు చేసిందేమీలేదని విమర్శించారు. అందువల్ల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని ఓడించాలని ప్రజలను కోరారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. మురికివాడలు, బస్తీలలో తాగునీటి సమస్య, రోడ్లు, డ్రయినేజీ సమస్య చాలా తీవ్రంగా ఉందని, దీనిని పట్టించుకున్న వారే కరువయ్యారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సిపిఎం స్వతంత్రంగా సభలు, సమావేశాలు పెడుతుందని, ఇంటింటికీ ప్రచారం చేస్తుందని ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తూనే ప్రజా సమస్యలపై నిరంతరం సిపిఎం పోరాటం చేస్తుందని తెలియజేశారు. ఈ సమావేశంలో సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం మహేందర్, కెఎన్ రాజన్న, జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్‌ఆశోక్ ఉన్నారు.

విఐటిఇఇఇ 2026 కోసం విట్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ : వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) తమ విఐటిఇఇఇ 2026 కోసం దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించినట్లు తెలిపింది. ఆశావహ ఇంజనీర్లను వారి కలల కెరీర్ వైపు తదుపరి అడుగు వేయమని ఆహ్వానిస్తోన్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఞఞఞ.ఙఓవవవ.ఙఓ.ఖఎ.ఊఆ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. వెల్లూరు, చెన్నయ్, అమరావతి, భోపాల్‌లోని విట్ క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్న ఫ్లాగ్‌షిప్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం విఐటిఇఇఇ 2026ను నిర్వహిస్తోన్నట్లు తెలిపింది. 2026 ఏప్రిల్ 28, మే మూడు వరకు పరీక్షా షెడ్యూల్ చేయబడింది. దేశంలోని 134 టెస్ట్ సిటీలలో, తొమ్మిది అంతర్జాతీయ టెస్ట్ సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, బలమైన పరిశ్రమ సంబంధాలు, అత్యుత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలతో ఇంజనీరింగ్ విద్య కోసం అత్యంత కోరుకునే గమ్యస్థానాలలో విట్ ఒకటిగా కొనసాగుతోందని తెలిపింది.

'న్యాక్' ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

- మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో, వారధి ట్రస్ట్ సహకారంతో ఉద్యోగావకాశాలతో కూడిన నైపుణ్య అభివద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్‌చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సివిల్ సూపర్‌వైజర్, ఎలక్ట్రీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. శిక్షణతోపాటు ఉచిత భోజనం, నివాస, వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్‌తోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం నవంబరు మూడు నుంచి హైదరాబాద్‌లోని న్యాక్‌లో ప్రారంభమవుతుందనీ తెలిపారు. శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8008937800, 9032504507 నంబర్లల్లో సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


దిలీప్ కుమార్‌కు నోటీసు అదజేస్తున్న టిపిటిఎఫ్ నేతలు

ఆశ్రమ పాఠశాలల సమస్యలపై దశలవారీ పోరాటం

- డిసెంబర్ 12న గిరిజన సంక్షేమ కమిషనరేట్ ముందు నిరసన
- గిరిజన సంక్షేమ శాఖ జెడికి టిపిటిఎఫ్ నేతల నోటీసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఆశ్రమ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడు దశల పోరాట కార్యక్రమాన్ని నిర్వహిం చనున్నట్టు టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. వచ్చేనెల 12,13 తేదీల్లో పాఠశాలల ముందు, అదేనెల 24న ఐటీడీఏ కార్యాలయాల ముందు, డిసెంబర్ 12న గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ ముందు నిరసన ప్రదర్శనలను చేపట్టనున్నట్టు పిలుపునిచ్చింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) ఎం దిలీప్ కుమార్‌ను గురువారం హైదరాబాద్‌లో టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి కలిసి ప్రత్యక్ష నోటీసును అందజేశారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండితులు, పీఈటీల పోస్టులను అప్‌గ్రేడ్ చేసి వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఆర్‌టిలను రెగ్యులరైజ్ చేసి టైం స్కేల్‌ను వర్తింపజేయాలని కోరారు. అన్ని పాఠశాలలకూ ప్యాటర్న్ ప్రకారం ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని సూచించారు. ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి ప్రతి బడికీ ప్రధానోపాధ్యాయుల పోస్టును మంజూరు చేయాలని తెలిపారు. ప్రతి బడికీ సర్వీస్ పర్సన్లను నియమించాలనీ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వసతి గృహాలకు ప్రత్యేకంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. అన్ని ఆశ్రమ పాఠశాలలకు డిజిటల్ బోధనోపకరణాలు, సైన్స్ పరికరాలు, కంప్యూటర్ ల్యాబ్‌లను మంజూరు చేయాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను అందించాలని తెలిపారు.